సాక్షి సిద్దిపేట
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



సిద్దిపేట పట్టణంలోని రామాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**తీరొక్క పూలు తెచ్చి.. బతుకమ్మను పేర్చి..**

బతుకమ్మ పండుగ ఉత్సవాలు రెండోరోజైన గురువారం జిల్లాలో అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణాల్లో, గ్రామాల్లో వాడవాడలో మహిళలు, యువతులు బతుకమ్మలను ఒకేచోట పేర్చి ఆడిపాడారు. బతుకమ్మకు నైవేద్యంగా అటుకులను సమర్పించారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనాలు చేశారు. అనంతరం మహిళలు ఫలహారాలు, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

# జననీ.. జగన్మాత

- బాలాత్రిపుర సుందరిగా వర్గల్ అమ్మవారు
- వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం



బాలాత్రిపుర సుందరిదేవిగా వర్గల్ అమ్మవారు



శరన్నవరాత్రోత్సవాల అంకురార్పణ పూజలు

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి సన్నిధిలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉత్సవాల తొలిరోజు విద్యాసరస్వతి అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా దివ్య దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆస్థాన వేదపండితులు బాల ఉమామహేశ్వరశర్మ పరివారం గణపతి పూజ, కలశ స్థాపనాది అంకురార్పణ నిర్వహించారు. యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. గర్భగుడిలో మూలవిరాట్టుకు మహాభిషేకం అనంతరం అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. శుక్రవారం గాయత్రిదేవి అలంకారంలో వర్గల్ అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## న్యూస్‌రీల్

### గ్రామీణ ఓటర్లు 6,14,371

**వార్డుల వారీగా తుది జాబితా**

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ఓటర్లు 6,14,371 మంది ఉన్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం జాబితాను విడుదల చేసింది. జిల్లాలో ఉన్న 5 మున్సిపాలిటీలను మినహాయించి మిగతా 491 గ్రామాలకు గాను 4,350 వార్డుల వారీగా ఓటరు జాబితాను విడుదల చేశారు. వీరిలో పురుషులు 3,02,321, మహిళలు 3,12,043 మంది ఓటర్లు ఉండగా ఇతరులు ఏడుగురు ఉన్నారు.

### ఏఆర్ ఎస్‌ఐలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌లు ఏఆర్ ఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు. వీరిని సీపీ కార్యాలయంలో సీపీ అనురాధ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదోన్నతులు జీవనశైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. పదోన్నతి వల్ల వచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తేవాలని సూచించారు.

### దసరాకు డీఏలు ప్రకటించాలి

సిద్దిపేటజోన్: దసరా పండుగకు ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డీఏలను ప్రకటించాలని జిల్లా టీఎన్జీఓ అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. రెండున్నరేళ్ల నుంచి డీఏ ప్రకటించలేదన్నారు. వాటిని పండుగకు ప్రకటించాలని కోరారు. ఆర్థిక కారణాల పేరిట జాప్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా సెలవు ఇవ్వకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐచ్చిక సెలవు నుంచి సాధారణ సెలవుగా మార్చాలని కోరారు.

### విద్యార్థుల ఉన్నతే లక్ష్యం కావాలి

**డీఐఈఓ రవీందర్‌రెడ్డి**
**జీజేఎల్‌ఏ జిల్లా నూతన కార్యవర్గం**

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థుల ఉన్నతే లక్ష్యం కావాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం(జీజేఎల్‌ఏ) జిల్లా అధ్యక్షుడిగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక కళాశాలలో జీజేఎల్‌ఏ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో పేదవిద్యార్థులు చేరుతారని వారి సంక్షేమమే ధ్యేయంగా అధ్యాపకులు పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని లెక్చరర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి అను నిత్యం కృషి చేస్తానని చెప్పారు. కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మధుసూదన్‌రావు, జాయింట్‌సెక్రటరీగా సదానందం, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, మహిళాకార్యదర్శిగా చాందికుమారి, రాష్ట్ర కౌన్సిలర్లుగా రాజిరెడ్డి, అశోక్, శివకుమార్‌లు ఎన్నికయ్యారు.

### నేలకొరిగిన వరి పంట

**ఆందోళనలో రైతులు**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. నందారం, ధర్మారం, కపూర్‌నాయక్‌తండా, మసిరెడ్డితండా తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో వరి పంటలు నేలకొరిగాయి. కోతకొచ్చిన తరుణంలో వరిపంట నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు సమయంలో పెట్టిన పెట్టుబడులు సైతం వచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు.

# కలవని చేతులు!

**నేతల మధ్య వర్గ విభేదాలు**

- సిద్దిపేటలో ఒకరిపై ఒకరు ఆరోపణలు
- దుబ్బాకలోనూ రెండు వర్గాలు
- గజ్వేల్‌లోనూ అదే సీన్
- అయోమయంలో పార్టీ శ్రేణులు
- మంత్రులు దృష్టి సారించాలంటున్న కార్యకర్తలు



జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతల వర్గ విభేదాల పరంపర కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ వర్గపోరు తగ్గడంలేదు. గురువారం గజ్వేల్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి వచ్చిన మంత్రులకు వర్గాలుగా విడిపోయి స్వాగతం పలకడం గమనార్హం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయకుండా ఎవరికి వారే వ్యవహరిస్తున్నారు. నామినేటెడ్ పదవులపై పెట్టిన శ్రద్ధ పార్టీ పటిష్టతపై పెట్టడం లేదని కార్యకర్తలు సైతం ఆరోపిస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్‌లో వర్గపోరు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే వరకు వచ్చింది. ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌లో కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ తనపై ఆరోపణలు చేశాడని పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ నేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం చేస్తున్నారని దీనిపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేసి 16వేలకు పైగా ఓట్లు సాధించారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిద్దిపేట నియోజకవర్గంలో సుమారు నాలుగు వర్గాలుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనసాగుతున్నారు.

**దుబ్బాకలో మారని సీన్..**

దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్‌లో రెండు వర్గాలుగా విడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్ కుమార్‌రెడ్డిల మధ్య వర్గ విభేదాలు కొన్నేళ్లగా కొనసాగున్నాయి. ఇటీవల దుబ్బాక పట్టణంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పర్యటన సందర్భంగా తమకు సమాచారం లేదని శ్రావణ్ కుమార్ వర్గానికి చెందిన మాజీ ఎంపీటీసీ సంజీవ రెడ్డి విలేకరులతో చెప్పారు. దీంతో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని సంజీవరెడ్డిని పార్టీ నుంచి ఇటీవల సస్పెండ్ చేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ప్రకటించారు.

**నర్సారెడ్డి వర్సెస్ శ్రీకాంత్ రావు**

మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పీసీసీ కార్యదర్శి శ్రీకాంత్‌రావుల మధ్య వర్గపోరు రోజురోజుకు పెరుగుతోంది. గురువారం గజ్వేల్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం సందర్భంగా గజ్వేల్‌కు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ములుగు మండలం వంటిమామిడి వద్ద శ్రీకాంత్ రావు స్వాగతం పలకలగా, ప్రజ్ఞాపూర్ వద్ద నర్సారెడ్డి స్వాగతం పలికారు. కాంగ్రెస్ కార్యక్రమాలు వేరు వేరుగానే నిర్వహిస్తుండటంతో పార్టీలోనే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.

**కార్యకర్తల్లో గందరగోళం**

సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సింది పోయి వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. ఇలా వర్గాలుగా ఉండటంతో కొత్త పార్టీలో చేరాలనుకునే వారు సైతం వెనకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలను ప్రజల్లో తీసుకవెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాల్సింది పోయి ఎవరికి వారు యమునా తీరే అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రత్యేక దృష్టి సారించి అందరినీ ఒక్కతాటిపైకి తీసుకరావాలని కార్యకర్తలు కోరుతున్నారు.

## ఎన్ని ఆటంకాలు సృష్టించినా..
# సంక్షేమ బాట వదలం

- రైతుల అభ్యున్నతే లక్ష్యం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- గజ్వేల్‌లో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం
- హాజరైన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్



ర్యాలీలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ తదితరులు

గజ్వేల్: ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. గురువారం గజ్వేల్‌లో నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని కొనియాడారు. వ్యవసాయరంగ ఉత్పత్తుల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**పనులకు అడ్డు తగిలితే సహించం..**



మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఇచ్చిన గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో ముందుకు సాగుతుండగా, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుడు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో తప్పుడు రాతలు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజల దృష్టి మరల్చడానికి హైడ్రా, మూసీ ప్రక్షాళనపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు అడ్డు తగిలితే సహించేదిలేదన్నారు. గజ్వేల్‌లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతు సంక్షేమానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ ఎక్కడ?**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్.. ఎక్కడ ఉన్నారని, నియోజకవర్గానికి రాకపోవడంతో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, ఇతర అభివృద్ధి పనులు ముందుకుసాగడం లేదన్నారు. మరోవైపు ప్రతిపక్ష నేతగా ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన విషయాన్ని కేసీఆర్ మరిచిపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మత్స్య సహకార సంస్థ చైర్మన్ సాయికుమార్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గృహనిర్మాణ సంస్థ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి.

# ప్రజాకంతకంగా కాంగ్రెస్ పాలన

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**




పోలీసులకు ఫిర్యాదు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: పది నెలల కాంగ్రెస్ పాలన ప్రజా కంతకంగా మారిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను దూషించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలన్నింటినీ పక్కన పెట్టి హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూల్చి వేసే పనిలో ప్రభుత్వం నిమగ్నమయ్యిందన్నారు. ప్రభుత్వ వికృత చేష్టల వల్ల నిరాశ్రయులవుతున్న పేదలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

# ఆడుకుంటుండగా కాటేసిన పాము

- ఎనిమిదేళ్ల బాలుడు మృతి
- సిద్దిపేట జిల్లాలో ఘటన
- పది రోజుల క్రితమే దుబాయ్ వెళ్లిన తండ్రి



మణికేశ్వర్ (ఫైల్)

సిద్దిపేటరూరల్: పాము కాటుకు బాలుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట మండలం రాఘవాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తుమ్మల లక్ష్మి, శ్రీనివాస్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు మణికేశ్వర్ (8) గురువారం ఉదయం తల్లితో పాటు బీడీల ఖార్ఖానాకు వెళ్లాడు. ఈ క్రమంలో బాలుడు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. తనను కరిచింది పాము అని తెలియక తల్లి వద్దకు వచ్చి ఏడవసాగాడు. దీంతో తల్లి పనులు ముగించుకుని ఇంటికి తీసుకెళ్లింది. అప్పటికీ బాలుడు తీవ్రంగా ఏడవడంతో నీళ్లు తాగించారు. పాము కరిచి గంటన్నర సమయం గడుస్తుండగా బాలుడు కిందపడిపోయాడు. వెంటనే స్థానికుల సాయంతో బాలుడిని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విషం శరీరమంతా వ్యాపించడంతో బాలుడు మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. 10 రోజుల క్రితమే పొట్టకూటి కోసం తండ్రి దుబాయ్ వెళ్లాడు. దీంతో కుమారుడు మృతి చెందిన సమచారం అందించారు. అతని రాకకోసం ఎదురు చూస్తున్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): చర్లఅంకిరెడ్డిపల్లిలో గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

# పకడ్బందీగా డిజిటల్ సర్వే

- అధికారులు అప్రమత్తంగా చేపట్టాలి
- కలెక్టర్ మనుచౌదరి



ముద్దాపూర్‌లో డిజిటల్ సర్వే చేపడుతున్న అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(గజ్వేల్): ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ)ల సర్వేలో ఎలాంటి తప్పిదాలు జరగవద్దని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్‌లో గురువారం ప్రారంభమైన సర్వేను కలెక్టర్ పలుచోట్ల ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని 150 కుటుంబాలను తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఈఓ మూడు టీంలుగా విడిపోయి ఇంటింటా సర్వే చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ కుటుంబం స్థితిగతులపై సమగ్ర ఆధారాలతో కూడిన డాటా సేకరించాలని అన్నారు. సర్వే ఆధారంగానే కుటుంబ స్థితిగతుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ఆన్‌లైన్ చేసి ప్రభుత్వం డిజిటల్ కార్డును అందజేస్తుందన్నారు. సర్వేలో తప్పిదాలు చోటుచేసుకోకుండా వాస్తవికతలను టీంలకు వివరించాలన్నారు. ఒకటికి రెండు మార్లు అడుగుతూ సర్వే ఫారాల్లో పూర్తి వివరాలను నోట్ చేసుకోవాలని టీంలకు కలెక్టరు సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్వే టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో మళ్లీ ఉద్రిక్తత



ఇరుపార్టీల నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

- ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతల యత్నం
- ప్రతిఘటించిన బీఆర్‌ఎస్ నేతలు
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- పోలీసుల రంగప్రవేశం

దుబ్బాక: పట్టణంలో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురువారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నించారు. అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు వారితో ఘర్షణకు దిగారు. దీంతో శివాజీ చౌరస్తాలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా ట్రోలింగ్ చేయడం వెనుక కొత్త ప్రభాకర్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులు పట్టుకొని వాహనాన్ని అడ్డుకునేందుకు యత్నించారు. పోలీసులు వారిని నిలువరించడంతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన బీఆర్‌ఎస్ నాయకులు ఘర్షణకు దిగారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే వాహనంపైకి కాంగ్రెస్ కార్యకర్తలు కోడిగడ్లు విసరడంతో పోలీసులు అడ్డుకొని చెదరగొట్టారు. ఈ ఘటనతో సుమారు గంటకు పైగా దుబ్బాకలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వారం వ్యవధిలోనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య మళ్లీ ఘర్షణ చోటుచేసుకోవడం గమనార్హం.

### తాటాకు చప్పళ్లకు భయపడం

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక: కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, ప్రజల పక్షాన ఉండి పోరాటాలు చేస్తామని కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో అసభ్యంగా ట్రోల్ చేయడంతో బాధపడ్డానని అన్నారు. కానీ సాటి మహిళ సినీ నటి సమంతపై ఆమె మాట్లాడిన మాటలు సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉన్నాయన్నారు. కేవలం 9 నెలల్లోనే రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. దొంగనే దొంగ అనే పరిస్థితి నెలకొందని మంత్రులు, అధికారులు ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు.



దుబ్బాకలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## క్లుప్తంగా

### అదుపుతప్పిన పోలీస్ వాహనం



రోడ్డు కిందకి దూసుకెళ్లిన వాహనం

అక్కన్నపేట(హుస్నాబాద్): పోలీస్ వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లిన ఘటన కట్కూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని దాస్‌తండా నుంచి బుధవారం రాత్రి అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌కు డయల్ 100కు కాల్ రావడంతో గురువారం తెల్లవారుజామున ఇద్దరు కానిస్టేబుళ్లు పోలీస్ వాహనంలో తండాకు వెళ్లారు. తిరిగొస్తుండగా కట్కూర్ గ్రామ శివారులోకి రాగానే ఒక్కసారిగా పోలీస్ వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లింది. ఇందులో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే, ఈ తండాకు వెళ్లే రహదారిపై గుత్తేదారుడు కంకర వేసి వదిలేశాడు. నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కూకుట్లపల్లిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. మంగళవారం రాత్రి కూకుట్లపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ మహిళ ధర్పల్లి భూమమ్మను అదే గ్రామానికి చెందిన చింతల మల్లేశం కల్లు దుకాణం వద్ద కులం పేరుతో దూషించి బూతు మాటలు తిడుతూ చెప్పుతో కొట్టినట్లు తెలిపారు. బాధితురాలు బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మల్లేశంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ విషయమై గురువారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ సిబ్బంది గ్రామానికి వెళ్లి విచారించారు. గొడవ జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఎస్పీకి సమర్పించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### యువకుడిపై కత్తులతో దాడి



ప్రవీణ్

బెజ్జంకి(సిద్దిపేట): యువకుడిపై కత్తులతో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని తోటపల్లి వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన సోమని ప్రవీణ్ కొన్ని నెలలుగా జగిత్యాల జిల్లా కోరుట్లలో నివసిస్తున్నాడు. కోరుట్ల నుంచి గురువారం ఉదయం కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో తోటపల్లి వద్ద బెజ్జంకికి చెందిన వేల్పుల శ్రీను, వేల్పుల శ్రీకాంత్, చందు, మరికొందరు కారును అడ్డుకొని ప్రవీణ్‌పై కత్తులతో దాడి చేశారు. చికిత్స నిమిత్తం ప్రవీణ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి నిలకడగానే ఉందని, ఆర్థికలావాదేవీలే ఈ దాడికి కారణమని ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

# కొంచెం సెట్ బ్యాక్ కాలేరా!

హుస్నాబాద్ : జాతీయ రహదారి విస్తరణ హుస్నాబాద్ ప్రజలకు, దుకాణదారులకు కొత్త సమస్య తెచ్చిపెడుతోంది. రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఇళ్ల యజమానులు, దుకాణదారులు వారి నిర్మాణంలో కొంత స్వచ్ఛందంగా కూలగొట్టారు. దీంతో రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఇళ్ల డ్రైనేజీ కాల్వకు, దుకాణదారుల పార్కింగ్‌కు స్థలం లేకుండా పోయింది. మార్కింగ్ కంటే మరో 10 ఫీట్లు సెట్ బ్యాక్ జరిగితేనే వీటి ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. దీనిపై మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించి ఏర్పాటు చేయకపోతే భవిష్యత్‌లో స్థానికులకు వరద నీటి, పార్కింగ్ కష్టాలు తప్పవు.

- హుస్నాబాద్‌లో ఇళ్లు, దుకాణాలకు జాతీయ రహదారి సమస్య
- 100 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ
- ఇప్పటికే షట్టర్లు, మెట్ల వరకు కొంత తొలగింపు
- మరో 10 ఫీట్లు వెనక్కి వెళ్తేనే డ్రైనేజీ, పార్కింగ్‌కు స్థలం
- పట్టించుకోని వ్యాపారస్తులు
- ఏర్పాటు చేయకపోతే భవిష్యత్‌లో తీవ్ర నష్టం
- అవగాహన కల్పించని అధికారులు



హుస్నాబాద్ పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

హుస్నాబాద్ పట్టణంలో జాతీయరహదారి విస్తరణకు ఏడాది కిందట అనుమతులు లభించాయి. ఇందుకుగాను అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి మూడు నెలల కిందట రోడ్డుకు ఇరువైపు సెట్ బ్యాక్‌కు సంబంధించి మార్కింగ్ వేశారు. 100 ఫీట్ల రోడ్డుకు గాను ఇరు వైపులా 50 ఫీట్ల వరకు మార్క్ చేశారు. డివైడర్ నుంచి ఇరువైపులా 43 ఫీట్ల వెడల్పుతో బీటీ రోడ్డు, రెయిన్ వాటర్ కోసం డ్రైన్ నిర్మించనున్నారు. మిగితా 7 ఫీట్ల స్థలంలో విద్యుత్ స్తంభాలు, మిషన్ భగీరథ, టెలిఫోన్ ఇతర పైపు లైన్లు ఏర్పాటు చేయనున్నారు. సెట్ బ్యాక్ కోసం ఇళ్లు, దుకాణాలకు సంబంధించి ముందు భాగాన్ని కొంత కూల్చివేయించారు.

### మరో 5 ఫీట్లు జరిగితేనే డ్రైనేజీ

పట్టణంలోని మెయిన్ రోడ్‌లో 100 ఫీట్ల రెడ్ మార్క్‌తో దుకాణాలు, ఇల్లు ఉన్నవారు బాల్కనీల వరకు కూలగొట్టుకున్నారు. కానీ వీరికి కొత్తగా డ్రైనేజీ సమస్య వచ్చింది. జాతీయ రహదారి నిర్మాణంతోపాటే వర్షపు నీళ్ల వెళ్లేలా అధికారులు రెయిన్ డ్రైన్‌ను నిర్మిస్తున్నారు. ఈ డ్రైన్‌లోకి దుకాణాలు, ఇళ్లకు సంబంధించిన మురికి నీటిని పంపించేందుకు అధికారులు ఒప్పుకోవడం లేదు. మురికి నీళ్లు ఇందులోకి రావొద్దని నిబంధన పెట్టారు. ప్రజలకు డ్రైనేజీ కాల్వ కావాలంటే మున్సిపల్ అధికారులు నిర్మించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం స్థలం లేకపోవడంతో మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దుకాణదారులు, ఇళ్ల యజమానులు 100 ఫీట్ల మార్కింగ్ కంటే మరో 3 నుంచి 5 ఫీట్ల వరకు సెట్ బ్యాక్ జరగాలి. అలా అయితేనే డ్రైనేజీ కాల్వ నిర్మాణానికి వీలుంటుంది. లేకపోతే మురికి నీరు రోడ్లపైకి, వర్షాలు వచ్చినప్పుడు వరద దుకాణాల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది.

### పార్కింగ్ సంగతేంటి..

జాతీయ రహదారి అధికారులు సూచించిన రెడ్ మార్క్ వరకే దుకాణదారులు ఫిక్స్ అయ్యారు. గతంలో ఇల్లు, దుకాణం ఏర్పాటు చేసుకునేటప్పుడే ముందర ఇనుప మెట్లు బంగ్లా పైకి వేసుకున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆ మెట్లు తొలగించారు. ఈ క్రమంలోనే దుకాణాల ఎదుట వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తుతుంది. ఇప్పటికే రెయిన్ డ్రైన్ నిర్మాణం కొనసాగుతుండగా, రోడ్డు నిర్మాణం పూర్తి కాగానే ఇనుప గ్రిల్లింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇది ఏర్పాటు చేస్తే దుకాణాదారులకు పార్కింగ్ స్థలం ఉండదు. వాహనాలు వెళ్లడానికి స్థలం కూడా దొరకదు. ఈ క్రమంలో 5 ఫీట్లు సెట్‌బ్యాక్ జరిగితేనే పార్కింగ్‌కు అవకాశం ఉంటుంది. లేకపోతే నడి రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. దుకాణదారులు పార్కింగ్ కోసం 5 ఫీట్లు వెనక్కి జరిగితే వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయి.

### మా పరిధిని దాటలేం



మెయిన్ రోడ్‌లో 100 ఫీట్లు మార్కింగ్ దాటిన వారికే ఇంటి నిర్మాణ అనుమతులు ఇస్తున్నాం. అంతకు మించి సెట్ బ్యాక్ కావాలని కోరే అధికారం మాకు లేదు. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ పనులు 100 ఫీట్ల వెడల్పుతో కొనసాగిస్తున్నారు. ఎవరైనా స్వచ్ఛందంగా మార్కింగ్ దాటి సెట్ బ్యాక్ అవడం వారి ఇష్టం. భవిష్యత్‌లో ప్రభుత్వం లేదా పాలకవర్గం తీసుకున్న నిర్ణయం ప్రకారమే మేము నడుచుకుంటాం.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

# జాతీయ స్థాయిలో రాణించాలి



షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

- ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

నారాయణఖేడ్: క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తూ తెలంగాణ కీర్తిని చాటాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. నారాయణఖేడ్‌లోని ఈ తక్షిల పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి 43వ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ 2024 జూనియర్ బాల, బాలికల పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజులపాటు జరుగనున్నాయి. క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గెలుపు కోసం కాకుండా క్రీడాస్ఫూర్తితో క్రీడాకారులు పాల్గొనాలని పేర్కొన్నారు. ఖేడ్ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఆయా క్రీడల్లో ఎంపికవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాంరెడ్డి, తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి ఐలయ్య, షెట్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మారుతీ, కిష్టయ్య, ఈ తక్షిల పాఠశాల కరస్పాండెంట్ శరత్, జిల్లా పీఈటీల కార్యదర్శి మారుతీ, సీనియర్ పీడీలు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు. 31 జిల్లాలు ఈ పోటీల్లో పాల్గొనగా అండర్ 18 జూనియర్ విభాగంలో ఒక్కో జిల్లా నుంచి 20 మంది చొప్పున 650 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. పోటీల మొదటి రోజు నల్లగొండ జనగామ జిల్లా జట్లు తలబడ్డాయి.

### అజ్జమర్రిలో ఉద్రిక్తత

శరన్నవరాత్రి మాలధారణ విషయంలో గొడవ



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్):శరన్నవరాత్రి మాలధారణ విషయంలో గొడవ జరగడంతో మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల కథనం మేరకు.. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామస్తులు అమ్మవారి మాల ధరించారు. విగ్రహాన్ని నిలబెట్టే సమయంలో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి, మరో వ్యక్తిని తీసుకొచ్చి మాలాధారణ చేయాలని పట్టుబట్టారు. ఈ విషయాన్ని ఓ వీడియో తీస్తుండగా ఇరువురి మధ్య గొడవ జరిగి తీవ్రతరమైంది. ఈ విషయం పోలీసులకు చెప్పడంతో చిలప్‌చెడ్ ఎస్ఐ యాదగిరి, కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎంతకు గొడవ సద్దుమణగకపోవడంతో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి వచ్చి గ్రామస్తులకు మాట్లాడగా సమస్య సద్దుమణిగింది.

### ఆటో బోల్తా ..

11 మంది కూలీలకు గాయాలు

నారాయణఖేడ్: ఆటో బోల్తా పడి 11 మంది కూలీలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. అబ్బెంద గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు గురువారం కర్ణాటక ప్రాంతానికి పనికి వెళ్తున్నారు. సక్రునాయక్ తండా వద్దకు రాగానే కుక్కలు అడ్డు రావడంతో ఆటో బోల్తా పడింది. దీంతో 11 మంది కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్ షెట్కార్ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

బెజ్జంకి(సిద్దిపేట) : కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. గుగ్గిల్ల గ్రామానికి చెందిన బానాల కనుకవ్వ (35) గుగ్గిల్ల గ్రామానికి చెందిన బానాల సంపత్ భార్య కనుకవ్వ (35) ముగ్గురు కుమార్తెలతో స్థానికంగా కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. మూడేళ్ల కిందట కనుకవ్వకు గర్భసంచి తొలిగించారు. ఇటీవల మళ్లీ కడుపునొప్పి రావడంతో భరించలేక బుధవారం పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి భర్త గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### పెళ్లి చేసుకుంటాడో లేదోనని..

పటాన్‌చెరు టౌన్ : ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకుంటాడో లేదో అనే అనుమానంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏపీలోని శ్రీకాకుళంకు చెందిన శ్రావణి(23) పటాన్‌చెరు మండలం ముత్తంగి సాయి ప్రియాకాలనీలో బుధవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తండ్రి రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించగా మృతికి గల కారణాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కుల్ పరిధిలోని అరబిందో పరిశ్రమలో శ్రావణి మూడేళ్లుగా కార్మికురాలి పని చేస్తుంది. రెండేళ్ల నుంచి అదే పరిశ్రమలో పనిచేసే ఓ పెళ్లయిన కార్మికుడిని ప్రేమించింది. అతడికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ విషయం కార్మికుడి భార్యకు తెలిసింది. దీంతో ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకుంటాడో లేదో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు.

### ఉరేసుకొని వివాహిత..

కుటుంబ తగాదాలతో మనస్తాపం చెందిన వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. పశ్చిమగోదావరికి చెందిన మహాలక్ష్మణుడు భార్య శ్రీవాణితో కలిసి మూడేళ్లుగా ఇంద్రేశం గ్రామ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. కుటుంబ విషయంలో భార్యాభర్తలు ఇద్దరూ బుధవారం గొడవపడ్డారు. దీంతో మనస్తాపంతో చెందిన శ్రీవాణి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# గంజాయి పట్టివేత

నిందితుడు అరెస్టు



గంజాయి ప్యాకెట్లు చూపుతున్న పోలీసులు

తూప్రాన్: తూప్రాన్ డివిజన్ కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి ఇంటిపై గురువారం టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నర్సాపూర్ ఎక్సైజ్ అధికారుల కథనం మేరకు.. డివిజన్ కేంద్రంలోని శివాజీనగర్ హనుమాన్ దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న సంగ నర్సింలు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు దాడులు నిర్వహించి 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నాం. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు నరేందర్, బాలయ్య, చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, హరీశ్, నరేశ్, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో డీఎఫ్‌ఓ శ్రీనివాస్, అధికారులు, అధ్యాపకులు

# వన్యప్రాణులను రక్షించుకుందాం

- 70వ వారోత్సవంలో వక్తలు

సిద్దిపేట ఎడ్యుకేషన్: పర్యావరణ వ్యవస్థలో ప్రతీ జీవి ముఖ్యమైనదేనని, వన్యప్రాణులను పరిరక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(కో ఎడ్యుకేషన్)లో 70వ వన్య ప్రాణుల వారోత్సవ కార్యక్రమాన్ని గురువారం జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌ఓ)కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. ప్రజల సహకారంతో వన్యప్రాణులను రక్షించుకునేందుకు అటవీశాఖ అధికారులు, ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అడవిలో 8 శాతం జీవ వైవి ధ్యం కోసం కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుకోకుంటే భవిష్యత్‌లో జీవ విధ్వంసం జరుగుతుందని ప్రతి ఒక్కరూ ప్రకృతి సమతుల్యతను రక్షించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు అశోక్, దుర్గాప్రసాద్‌రెడ్డి, సాధిక్, అభిలాష్‌రెడ్డి, సిద్రాఫాతిమా, లక్ష్మణ్, మన్సీజా, ప్రశాంత్, కావ్యశ్రీ, స్పందన, బ్రాహ్మణి, ఇమ్రా, సభా, సానియా, కీర్తిక, మెహక్‌లకు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సత్యనారాయణరెడ్డి, రాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్రమొద్దీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధరిపల్లి నగేశ్, అధ్యాపకులు కనకచంద్రం, వనజారెడ్డి, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రాజ్యలక్ష్మి, రమ, రఘురాజ్, గంగాధర్, శ్రీనివాస్, ప్రసాద్‌తోపాటు ఫారెస్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు చేయాలి



మాట్లాడుతున్న ప్రతాప్‌సింగ్

- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్‌సింగ్

హవేళిఘణాపూర్(మెదక్): వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని, దీని ద్వారా రైతులు మంచి దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్‌సింగ్ అన్నారు. గురువారం హవేళిఘణాపూర్ రైతు వేదికలో డివిజన్ స్థాయి రైతులతో ఆయిల్‌పామ్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ.. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంట సాగు చేయాలన్నారు. ఒక ఎకరా వరి వేసే నీళ్లతో 5 ఎకరాల ఆయిల్ పామ్ పంట సాగు చేయొచ్చని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా మొక్కలను రాయితీపై అందజేయడంతో పాటు నాలుగేళ్ల తోట నిర్వహణ, అంతర పంటల సాగు కోసం రాయితీ మొత్తంగా రూ.26,450 సొమ్మును రైతుల ఖాతాలో జమ చేస్తారన్నారు. అనంతరం డాక్టర్ రంగనాయక్ మాట్లాడుతూ.. ఎకరానికి 57 మొక్కలు 99 మీటర్ల దూరంలో త్రికోణ ఆకార పద్ధతి ద్వారా నాటుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఒక్క టన్ను ఆయిల్‌పామ్ గెల ధర రూ.రూ.13,500 ఈ లెక్కన ఏడాదికి రూ.1,62,000 ఆదాయం వస్తుందన్నారు. ఖర్చులు పోను ఎకరానికి రూ.1,20,000 ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ ఉప సంచాలకులు టెక్నికల్ వినయ్, మెదక్ డివిజన్ వ్యవసాయ ఉప సంచాలకులు విజయ నిర్మల, ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ, ఏఓ బాల్‌రెడ్డి, సంతోష్, రచన, భవానీ, జాన్సన్, ప్రశాంత్, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ యజమానులు, హవేళిఘణాపూర్ మండల రైతులు పాల్గొన్నారు.

# సీఎం దృష్టికి తీసుకెళ్తా..

- అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): బాలికను అత్యాచారం చేసిన నిందితుడికి కఠిన శిక్ష పడేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కుర్మ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశ్, మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమతో కలిసి గురువన్నపేటలో బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. నిందితుడి ఇంటిపై దాడి చేసిన 15 మంది గ్రామస్తులపై పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని సీపీ అనురాధను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొమురవెల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, సనాది భాస్కర్, చెరుకు రమణారెడ్డి, మెరుగు శ్రీనివాస్, జంగని రవి, కుర్మ సంఘం నాయకులు కోరే ఎల్లయ్య, కంచె రాములు, శ్రీశైలం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కాలం చెల్లిన మందులు పంపిణీ

- ప్రభుత్వాస్పత్రి తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

కౌడిపల్లి(నర్సాపూర్): చిన్న పిల్లలకు చికిత్స నిర్వహించి కాలం చెల్లించిన మందులు అందజేయడంపై పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రతీ గురువారం కౌడిపల్లి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో బాలింతలు, నవజాత శిశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారు. ఇందులో భాగంగా మహ్మద్‌నగర్, సలాబత్‌పూర్ సబ్ సెంటర్ పరిధిలోని బాలింతలు, నవజాత శిశువులను 102లో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సెంటర్‌కు తీసుకొచ్చారు. వైద్యులు వారికి చికిత్స నిర్వహించి మందులు రాశారు. కాగా ఆస్పత్రి ఫార్మసిస్ట్ కొలెకాల్సిఫెరోల్ (విటమిన్ డీ3) మందులను పంపిణీ చేశారు. మహ్మద్‌నగర్‌కు చెందిన ఏడుగురితోపాటు సలాబత్‌పూర్‌కు చెందిన పలువురు బాలింతలకు కాలం చెల్లిన మందులు ఇచ్చారు. ఇంటికి వెళ్లిన తర్వాత గమనించిన వారు వైద్యసిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మందులను ఎవరూ ఇంకా వాడకపోవడంతో ప్రమాదం తప్పిందని వాడితే జరిగే ప్రమాదానికి బాధ్యులు ఎవరని గ్రామస్తులు ప్రశ్నించారు.



# నాటు బాంబుల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో నాటు బాంబులతో వన్యప్రాణులను వేటాడుతున్న వేటగాళ్లను గురువారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ కొంద్ర శ్రీనివాస్ కథనం మేరకు.. అడవుల్లో జంతువుల కోసం నాటు బాంబులు పెట్టి ప్రాణహాని కలిగిస్తున్నారన్నారు. ఆగస్టు 5న మీర్జాపూర్ గుట్టల ప్రాంతంలో నాటు బాంబు పేలి రైతు ఎండీ ఖలీం చేతికి తీవ్రగాయాలయ్యాయి. బాధిత రైతు సోదరుడు తాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నాం. మీర్జాపూర్‌లోని ఓ ఇంటిలో నాటు బాంబులు ఉన్నాయనే నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేయగా నిజంగా దొరికట్లు తెలిపారు. బాంబులు తయారు చేసే పిట్టల స్వామి, బదనాపురం తిరుపతి, కందుకూరి భాస్కర్, ఇటిక్యాల సతీశ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా పందులను వేటాడినట్లు అంగీకరించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### జల్సాలకు అలవాటు పడి బోరు మోటార్లు, వైర్లు దొంగతనం

ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు



దొంగలను చూపుత్ను ఎస్సై శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): వ్యవసాయ బావుల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణానికి చెందిన నూనె నర్సింలు (40), పానేటి ఎల్లయ్య(30) కొంత కాలంగా స్నేహితులు. ఇద్దరూ దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో జులైలో పంప్‌హౌజ్ పనులు జరుగుతున్న చోట ఇనుప సామగ్రి, చందాపూర్ గ్రామ శివారులోని 11 వ్యవసాయ బావుల వద్ద నుంచి విద్యుత్ వైర్లు, స్టాటర్‌లను ఎత్తుకెళ్లారు. దొంగిలించిన వాటిని తూప్రాన్ పట్టణంలో అమ్మకానికి పెట్టారు. మళ్లీ 20 రోజు తర్వాత మైలారం గ్రామ శివారులోనూ, కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామ శివారులోనూ బావుల వద్ద సామగ్రి ఎత్తుకెళ్లారు. ఈనెల 2వ తేదీన రాత్రి కుకునూరుపల్లి శివారు ప్రాంతంలో దొంగతనాలకు యత్నించగా కుదరకపోవడంతో గురువారం ఉదయం ఆటోలో సిద్దిపేటకు వెళ్తున్నారు. లక్దారం గ్రామ శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకున్నారు. పోలీస్టేషన్‌కు తరలించి విచారించగా దొంగతనాలన్నీ ఒప్పుకున్నారు. వెంటనే వారి నుంచి రూ.36 వేల నగదు, ఆటో స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఇద్దరు నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చగా శిక్ష విధించినట్లు ఎస్సై వెల్లడించారు.